కామెడీ కథ

డా. కొఠారి వాణీ చలపతిరావు

# మా అమ్మమ్మ అమెరికా ప్రయాణం

**ఇండియా నుంచి ఈరోజు నాన్న ఫోన్ చేసారు. అమ్మమ్మకు అమెరికా రావడానికి వీసా దొరికిందట. అమ్మ వర్కింగ్ ఉమెన్ గనుక తను రావాలనుకున్నా రాలేదు. అందుకే అమ్మమ్మ నా పురిటి బాధ్యతను తను నెత్తిన వేసుకుంటూ అమ్మతో ''నువ్వేమీ దిగులు పడకు. నీ బదులు నేను అమెరికా వెళ్ళి నా మనవరాలికి లక్షణంగా పురుడు పోసివస్తాను'' అని అత్యుత్సాహంతో ప్రయాణ సన్నాహాలు చేసుకుంటోందట.**

అందులో భాగంగా అమెరికన్ కాన్సిలేట్‌కు వీసా ఇంటర్వ్యూకి నాన్నతో బయలుదేరి అక్కడి అధికారులను హడల గొట్టేసిందట కూడా. ఆ ప్రహసనాన్ని అమ్మ ఫోనులో పూసగుచ్చినట్టు చెబుతుంటే నేను పడీ పడీ నవ్వలేక చచ్చాను.

''మనవరాలి పురుడు పోయడానికి వెళుతున్నాను. వీసా ఇవ్వమంటే అమెరికా వాళ్ళు అస్సలు వెళ్ళనివ్వరు. వేరే ఏదయినా కారణం చెప్పమని'' అమ్మ అంటే ''అబద్ధం చెప్పాల్సిన అగత్యం నాకేం పట్టింది. అయినా పిల్ల పురిటికి పోతున్నానంటే అనుమతివ్వననే అంత్ల వెధవ అజ్ఞానపు దద్దమ్మ ఎవరుంటారక్కడ? ఏం అమెరికా ఆడాళ్ళు పిల్లల్ని కనరా..వాళ్ళకు అమ్మల, అమ్మమ్మల అవసరం పడదా..పురుడంటే మాటలా! ఎన్ని పనులుంటాయి. పుట్టే పిల్లకు ఉగ్గు పెట్టాలి..నలుగుపెట్టి, కాళ్ళమీద వేసుకొని స్నానం చేయించాలి, సాంబ్రాణి పొగవెయ్యాలి.. అంతేనా? తల్లికి ఎంతగా పత్యం చేయించాలి? కారంపొడి, కాయప్పొడి వేసి అన్నం పెట్టాలి. చలిగాలి, చల్లనీళ్ళు తగలకుండా చూడాలి'' అంటూ బానంత నోరు పెట్టుకుని అమ్మనోరు మూయించిందట. అంతే కాదు! కనబడ్డ వాళ్ళందరికీ రోజూ నా కాన్పు కబుర్లే చెబుతోందట, స్టాంపింగ్ రోజు అనుకున్నట్టే..కాన్సిలేట్ ఆఫీసులో అధికారి 'అమెరికాలో బోలెడు మెడికల్ ఫెసిలిటీస్ ఉన్నాయి. మీ మనవరాలిని ఆమెకు పుట్టబోయే పాపను అక్కడి డాక్టర్లు, నర్సులు చాలా కేర్ తీసుకుంటారు. మీరేమీ 'వర్రీ కావద్దు. దీని కోసమని అక్కడికి ఇప్పుడు మీరు వెళ్ళాల్సిన అవసరం లేదని' ట్రాన్స్‌లేటర్ చేత చెప్పించాడట. ఆ మాటలతో అమ్మమ్మ ఆడపాములా బుసకొట్టి 'ఏం కేర్ తీసుకుంటావు నీ బొంద. హాస్పటల్‌లో ఉన్న ఒకటి రెండు రోజులు నువ్వు, నీ దేశం కేర్ తీసుకుంటే సరిపోయిందా? ఇంటికొచ్చాక ఎవరు వాళ్ళ ఆలనా, పాలనా చూస్తారు నువ్వా, నీ అమ్మమ్మా. విడ్డూరం కాకపోతే బాలింత దగ్గర పెద్దవాళ్ళు లేకుంటే ఎలా నడుస్తుంది? ఇక్కడి నుంచి నేను ఆముదం వండి, సున్నిపిండి మర పట్టించుకుని వెళ్ళకపోతే ఎలా?' అని వాళ్ళమీద ఎగబడిందట. ఆముదం అంటే ఏమిటో సున్నిపిండి అంటే ఏమిటో అర్థంకాక ఆ తెల్లముఖం బిక్కముఖం పెట్టి ట్రాన్స్‌లేటర్ వంక చూసాట్ట. క్యాస్ట్రాయిల్, బాత్ పౌడర్ అంటూ మునివేళ్ళతో మోనో యాక్షన్ చేసి అతడు వంకర్లు, టింకర్లు తిరిగి నానా అవస్థలు పడుతుంటే..అది చూడలేక అతనేం చెబుతున్నాడో అర్థం చేసుకోలేక జుట్టు పీక్కున్నాడట ఆ శ్వేత అధికారి. అమ్మమ్మ వీసా ప్రహసనాన్ని అమ్మ నాకు వినిపిస్తుంటే...వెనక నుండి ''ఆ ఫోను ఇలా ఇవ్వు..నేను దాంతో మాట్లాడతాను'' అని అమ్మమ్మ అనటం నాకు వినిపించింది.

ఫోనులో స్వరం మారింది ఈసారి. పెద్దగా మాట్లాడితే తప్ప అంతదూరంలో ఉన్న అమెరికాకు వినబడదన్న అపోహతో అవతల అమ్మమ్మ మాట్లాడుతుండటంతో నా కర్ణభేరి 'ఫట్'మని పేలిపోతున్న భావం కలిగింది ఇవతల ఉన్న నాకు.

''అమ్మాయ్! ఎలా ఉన్నావే...వంట్లో తేలిగ్గా ఉంటోందా...బరువు పనులేమీ చేయటంలేదు కదా..అన్నట్టు చెప్పడం మర్చిపోయాను. నాకు 'ఈసా' దొరికిందేవ్. నేను వచ్చేలోపు ఏమాత్రం కాస్త సుస్తీ అనిపించినా..ఇరుగుపొరుగు అమ్మలక్కలు ఉంటారుగా..వాళ్ళకు చెప్పి సహాయం తీసుకో. అసలే తొలికాన్పు..నువ్వా వట్టి మాలోకానివి'' అంటూ మొదలుపెట్టింది అమ్మమ్మ.

''అలాగేలే అమ్మమ్మా..నువ్వు ఫోన్ అమ్మకిచ్చేయ్'' అని నేను అంటూండగానే అమ్మ లైన్‌లోకి వచ్చింది.

''అమ్మా..ఈ అమ్మమ్మతో ఎలాగే?'' అన్నాను బేలగా.


అమ్మ నవ్విన శబ్దం. ''అమెరికా ప్రయాణం అన్న దగ్గరి నుంచీ పాపం తెగ హడావుడీ పడిపోతోంది. ఇరవయ్యో, ముప్పయ్యో పురుళ్ళు పోసిన అనుభవమట తనది. చాదస్తం, వెనకటి పద్ధతులు అనిపించినా ఆ ఆరాటం వెనక బోలెడు ప్రేమ దాగుందే అమ్మడూ..ఈరోజుల్లో ఇలాంటి మనుషులు కాగడా వేసి వెదికినా దొరకరు. ముందు తరాలకయితే కలికం లోకి కూడా కనబడరు'' అంది అమ్మ.

నిజమేననిపించింది నాకు.

''అమ్మమ్మ ఒంటరిగా వస్తోంది. దూరాభారం..పరవాలేదు కదా!'' అంది అమ్మ కంఠంలో భయం వ్యక్తమవుతుండగా.

''ఆ భయం రవ్వంత కూడా అవసరం లేదు. పెద్దవాళ్ళను ఇక్కడి ఎయిర్‌లైన్స్ వాళ్ళు పువ్వుల్లో

**ఆ దృశ్యాన్ని కళ్ళముందు ఊహించుకుని నేనూ నవ్వుకున్నాను. ఫోన్ పెట్టేసి మంచం మీద వాలితే..కళ్ళు మూసుకోగానే అమ్మమ్మ రూపం కళ్ళ ముందు మెదిలింది. బిళ్ళగోచీ, చత్వారం కళ్ళజోడు, నుదుటన పొడగాటి త్రిచూర్ణం బొట్టు, దబ్బపండులాంటి శరీరచ్ఛాయ ఇవే కళ్ళ ముందు నిలిచాయి. కొడుకులు లేని అమ్మమ్మకు అమ్మే వృద్ధాప్యంలో ఆధారం, ఆసరా అయింది. అందుకే అమ్మమ్మతో కలిసి గడిపిన నా బాల్యం ఓ అందమైన స్వప్నంలా ఇప్పటికీ కళ్ళముందు సాక్షాత్కరిస్తుంది.**




పెట్టి చూసుకుంటారు. ఇంగ్లీషు రాని వాళ్ళను, అస్సలు చదువుకోని వాళ్ళను ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ గమ్యానికి చేర్చి అయిన వాళ్ళకు అప్పగిస్తారు'' అన్నాను అమ్మతో.

''ఇంగ్లీషు రానివాళ్ళంటే గుర్తొచ్చింది. 'అమెరికా వెళ్తున్నాను' అన్నప్పటి నుంచీ అమ్మమ్మ మీ మేనల్లుడు బాబ్జీ దగ్గర కూర్చుని రోజూ ఇంగ్లీషు పాఠాలు నేర్చుకుంటోంది. మేమంతా నవ్వలేక చస్తున్నాం. అది చూసి- ఎందుకే అలా నవ్వుతారు? అక్కడ ఉండేదంతా ఆంగ్లేయులు. వాళ్ళకేమో పొట్టకోస్తే ఒక్క తెలుగుముక్కా రాదాయె. ఎప్పుడు ఏం అవసరం పడుతుందో అని నాలుగు ఇంగ్లీషు ముక్కలు నేర్చుకుంటున్నాను అంటోంది అమ్మమ్మ'' అంది అమ్మ.

అది విని..ఆ దృశ్యాన్ని కళ్ళముందు ఊహించుకుని నేనూ నవ్వుకున్నాను. ఫోన్ పెట్టేసి మంచం మీద వాలితే..కళ్ళు మూసుకోగానే అమ్మమ్మ రూపం కళ్ళముందు మెదిలింది. బిళ్ళగోచీ, చత్వారం కళ్ళజోడు, నుదుటన పొడగాటి త్రిచూర్ణం బొట్టు, దబ్బపండులాంటి శరీర ఛ్ఛాయ ఇవే కళ్ళ ముందు నిలిచాయి. కొడుకులు లేని అమ్మమ్మకు అమ్మే వృద్ధాప్యంలో ఆధారం, ఆసరా అయింది. అందుకే అమ్మమ్మతో కలిసి గడిపిన నా బాల్యం ఓ అందమైన స్వప్నంలా ఇప్పటికీ కళ్ళ ముందు సాక్షాత్కరిస్తుంది.

అమ్మమ్మ వళ్ళో కూర్చుని బిర్రుజడ వేయించుకుని రిబ్బను కుచ్చులు పెట్టించుకున్నాను. పండగలప్పుడు, బతకమ్మలు ఆడేటప్పుడు స్పెషల్‌గా మొగలిపూల జడ, చేమంతుల జడ వేసి కింద జడగంటలు పెట్టి..పట్టుపరికిణీ కట్టేది. రాత్రి వేళల్లో తన పక్కలో పడుకోబెట్టుకుని గోవింద నామాలు, పురాణకథలు, పల్లెటూరి పాటలు వినిపించేది.


''కథ చెబుతున్నప్పుడు 'ఊ' కొట్టవే అలివేలు

మంగతాయారూ లేకుంటే మూగ పిల్లలు పుడతారు'' అనేది. మాటి మాటికీ తనను పూర్తిపేరుతో నోటినిండా పిలుస్తూ ఆడపిల్లలు ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో నిముషానికొకసారి చెబుతుండేది. శారీరకంగా తను ఎదిగే ప్రతి అడుగూ అమ్మమ్మకు మురిపెంగా, ముచ్చటగా ఉండేది.

తను పెద్దమనిషి అయినప్పుడు, తను పెళ్ళికూతురు అయినప్పుడు అమ్మమ్మ హడావుడీ అంతా ఇంతా కాదు.

అలాంటి అమ్మమ్మను వదిలి తను భర్తతో అమెరికా వచ్చేసింది. 'అంత దూరం వెళుతున్నావు అంతెత్తున ఆకాశంలో ఎగిరి ప్రయాణం చేయబోతున్నావు. ఎలా ఉంటావో ఏమో జాగ్రత్త' అని ఎన్నిసార్లు చెప్పిందో, ఎంతగా దిగులు పడిందో మాటల్లో చెప్పలేను.

అలాంటి అమ్మమ్మ కొద్దిరోజుల్లో నా దగ్గరికి అదే అమెరికాకు రాబోతోంది. ఆ ఆలోచన నాకు ఆనందాన్ని ఇచ్చింది.



★★★

అమ్మమ్మ అమెరికా వచ్చేసింది.

వీల్ చెయిర్‌లో మహారాణిలా ఠీవిగా కూర్చుని శాన్‌ఫ్రాన్సిస్‌కో ఎయిర్‌పోర్ట్ అంతా చుట్టబెట్టి మొత్తానికి మమ్మల్ని చేరుకుంది.

నన్ను చూడగానే అమాంతం వీల్ చెయిర్‌లో నుంచి లేచి ఆప్యాయంగా నన్ను దగ్గరికి తీసుకుని నా పొట్టని తడుముతూ ''బాగున్నావా'' అని అడిగింది.

''అమ్మమ్మా...జాగ్రత్తగా వచ్చావు కదా..ప్రయాణంలో ఇబ్బందేమీ కాలేదు కదా'' అని నేను అడగగానే ''హాయిగా, దర్జాగా వచ్చేసానే..మూర్ఛరోగి మెళ్ళో బిళ్ళ వేసినట్లు..నా మెళ్ళో ఈ బిళ్ళవేసి అక్కడ ఎక్కించారు..ఇక్కడ దింపుకున్నారు. అడుగడుగునా రాజభోగమే అనుకో'' అంటూ అంతవరకూ తను కూర్చున్న వీల్‌చెయిర్‌ని నెడుతూ తనను తీసుకొచ్చిన ఎయిర్‌పోర్ట్ ఉద్యోగివైపు తిరిగి ''థాంక్యూ'' అంది అమ్మమ్మ.

మావారు, నేను ముసిముసి నవ్వులు నవ్వుకున్నాం.

నన్ను ఆపాద మస్తకం ఎగాదిగా చూస్తూ ''నిండునెలల మనిషివి. ఆ లాగూ చొక్కా ఏమిటే...ఎంచక్కా చీర కట్టుకోక..ఆ చొక్కాలోంచి నీ పొట్ట కుండలా బయటికి వచ్చి ఎలా కనబడుతుందో చూడు. అయ్యయ్యో..దిష్టి తగలదూ'' అంది అమ్మమ్మ నన్ను చూసి.

''ప్రెగ్నెంట్ ఉమెన్ కోసం ఇక్కడ చాలా ప్రత్యేకమైన దుస్తులు దొరుకుతాయి. చాలా కంఫర్టబుల్‌గా ఉంటాయి'' అన్నాను. అయినా నా మాటలు అమ్మమ్మకు రుచించినట్టు కనబడలేదు. ముగ్గురం కలిసి కారు పార్కింగ్ దగ్గరికి వచ్చాం.

''ఇప్పుడు మనం కంకరరోడ్ వెళ్ళాలి కదూ..నాకు తెలుసు'' అంది అమ్మమ్మ చటుక్కున.

నేను, మా వారూ ముఖాముఖాలు చూసుకున్నాం అర్థంకాక.

''అదేనే..మీరుండేది కంకరరోడ్ లోనే కదా?'' అంది అమ్మమ్మ. 'కాంకర్డ్'కు వచ్చిన తిప్పలు అని అర్థమైంది.

## అంతా అయిపోయిందిట!

**'బొమ్మరిల్లు'తో తెలుగులో క్రేజీ హీరోగా మారిన తమిళ యువకుడు సిద్ధార్థ- 'రంగ్ దే బసంతీ' సినిమా ద్వారా హిందీ తెరకి కూడా పరిచయం అయ్యాడు. ఈ సినిమా సిద్ధార్థకి మంచి పేరు తెచ్చింది కానీ మరో హిందీ సినిమాని ఇంతదాకా చేయలేదు. ఇప్పుడు తాజాగా డేవిడ్ ధావన్ దర్శకత్వం వహించే కొత్త హిందీ చిత్రంలో సిద్ధార్థ హీరోగా ఎన్నికైనట్టు వార్తలు వినిపిస్తున్నాయి. అదలా వుంటే సిద్ధార్థ వైవాహిక జీవితంలో గొడవ ఓ కొలిక్కి వచ్చేసింది. సిద్ధార్థగా పాపులర్ అయిన 'సిద్ధార్థ సూర్యనారాయణ'కి భార్య మేఘనతో విడాకులు ఖరారు అయిపోయినట్టు కోలీవుడ్ కంటే ముందే బాలీవుడ్‌లోనే ఎక్కువగా ప్రచారంలో వుందిప్పుడు.**

కారు వెనక సీట్‌లో కూర్చుంది అమ్మమ్మ. బెల్ట్ పెట్టుకోవడం రాకపోతే మావారే పెట్టారు.

''ఈ బంధనాలేమిటో..కట్టిపడేసినట్టుంది. పెద్దదాన్ని. నేను కూడా ఈ బెల్టులు పెట్టుకోవాలా..ఎవరన్నా పట్టుకున్నా 'పోనీలే పెద్దమనిషిని' అని వదిలేస్తారేమోలే'' అంది అమ్మమ్మ.

''ఇక్కడ ట్రాఫిక్ రూల్స్ చాలా స్ట్రిక్ట్. పట్టుకుంటే బోలెడు ఫైన్ వేస్తారు. ఎప్పుడు కారులో కూర్చున్నా బెల్టు పెట్టుకోడం మాత్రం మర్చిపోకు అమ్మమ్మా'' అన్నాను మావారి పక్కన ముందు సీట్లో కూర్చుంటూ. దారిపొడుగునా అమ్మమ్మ అమెరికాని అబ్జర్వ్ చేస్తూ-

''అబ్బ...ఇక్కడ రోడ్లు ఎంత బాగున్నాయే...అద్దాల్లా మెరిసిపోతున్నాయి. కాలినడకన ఒక్క మనిషీ కనబడడేంటి..అందరూ తూనీగల్లా తుర్రున కార్లలో పోయేవాళ్ళే..ఇక్కడ డబ్బులున్న వాళ్ళు తప్ప అసలు బీదవాళ్ళు అంటూ ఉండరా ఏమిటే? ఇక్కడ ఒక్క ఆడదీ చీరకట్టుకుని కనబడదేమే..ఆ చాలీ చాలని గుడ్డలు, వళ్ళంతా కనబడే చొక్కాలు ఏంటి అసహ్యంగా. పైగా నన్ను అందరూ విచిత్రంగా చూస్తున్నారేంటి విమానం దిగిన దగ్గరనుంచీ! అవునేవ్ అలివేలు మంగతాయారు..ఇన్ని సంవత్సరాల నుంచీ ఇక్కడ ఉన్నావుకదా

ఒక విషయం కనిపెట్టావా నువ్వు? ఈ దేశంలో చిన్నపిల్లలకు, వయసులో ఉన్నపిల్లలకు కూడా అప్పుడే జుట్టు తెల్లబడిపోయి జనపనారలా తయా

రయిపోతోంది. నా పక్కనే కూర్చుంది ఓ చిన్నపిల్ల విమానంలో..ఆ పిల్లకూ, లోపల బండి తోసుకుంటూ కాఫీలు, టీలు ఇస్తారు చూడూ..ఆ వాళ్ళకూ..అందరికీ తెల్లజుట్టే..నా జుట్టు నయం ఇంకా అక్కడొకటీ..ఇక్కడొకటీ అయినా నల్లవెంట్రుకలు కనబడతాయి. బహుశ ఇక్కడి వాతావరణం, గాలి, నీళ్లు..వీటి మూలంగాననుకుంటా ఆ బాలనెరుపు'' అని అమ్మమ్మ ధారాళంగా మాట్లాడుతూ, మధ్య మధ్య అలా స్వగతాలు మాట్లాడేస్తుంటే మావారు ముసిముసి నవ్వులు నవ్వటం మొదలుపెట్టారు. నేనయితే బయటికే పెద్దగా నవ్వేసాను.

ఇంటికి చేరుకోగానే మా అమ్మమ్మ చకచకా ఇల్లంతా కలయతిరిగి చూసింది. ఇంటి ముందు కారు ఆగగానే దూరం నించి మా ఇల్లు చూసి ఫస్ట్ అమ్మమ్మ అన్న డైలాగు..

''ఓ పెంకుటిల్లే- అచ్చం మా రామాపురంలో ఉన్న పల్లెటూరి ఇల్లులాగే ఉంది. అమెరికాలో ఇల్లంటే ఇరుకుగా, బొమ్మరిల్లులా ఉంటుందేమో అనుకున్నాను'' అని.

మా ఫ్రంట్ యార్డ్, బ్యాక్ యార్డ్..అందులో ఉన్న పూల చెట్లు, పెద్దలాన్, అమ్మమ్మ కోసం నేను కొత్తగా అరేంజ్ చేసిన తులసి కోట చూసి తెగ మురిసిపోయింది.

''నా మడి చీరలు ఆరేసుకోవటానికి, వడియాలు ఎండబెట్టుకోవటానికి, పుట్టబోయే పిల్లను కాళ్ళమీద వేసుకుని గంగాళం నీళ్ళు స్నానం చేయించడానికి బోలెడు జాగా ఉంది. ఇది చాలు'' అని చిన్నపిల్లలా అంతా తిరిగి చూసుకుని సంబరపడిపోయింది.

అదే అమ్మమ్మ రెండు రోజుల తర్వాత శాన్‌ఫ్రాన్సిస్‌కో సిటీ చూపించటానికి తీసుకెళ్తే అక్కడి ఆకాశ హర్మ్యాలను, అందమైన రోడ్లను, బర్క్లీహిల్స్, యూనివర్సిటీ రోడ్‌లోని వింత వ్యక్తులను చూసి ముక్కుమీద వేలేసుకుంది.

''అయ్యో! వాడికి అదేం పోయేకాలం ఆడపిల్లలా అంత పొడుగున జుట్టుపెంచుకున్నాడు. సన్యాసిలా అట్టలు కూడా కట్టించాడు ఆ వెంట్రుకలను. అయ్యో! ఆ అమ్మాయికి ఏమొచ్చింది. పైట లేకపోగా అలా తిరుగుతోంది..సిగ్గులేదూ..ఛ..ఛ! ఇంట్లో అమ్మా, నాన్నా అయినా ఆడపిల్ల అలా ఉండకూడదని చెప్పరా ఏంటి ఖర్మ''

విరబోసుకున్న జుట్లకు ఎర్రరంగు, ఆకుపచ్చరంగు, ఇంకా పంచరంగులు వేసుకున్న అమ్మాయిలను చూసి ''తుమ్మెదరెక్కల్లా ఉండాల్సిన జుట్టు ఇలా సీతాకోచిలుక రెక్కల్లా వుండటం ఏం అందమే నా బొంద'' అంటుంటే ఇంతలో ఎదురుగా ఓ కుర్రాడు జెల్ పెట్టి నిక్కబొడుచుకునేలా జేసిన జుట్టుతో ఎదురయ్యాడు. ఇంకేముంది అమ్మమ్మ రెచ్చిపోయింది.

''ముళ్ళపందిలా ఆ తలేంటి వీడి పిండాకూడు'' అంటూ తిట్ల వర్షం కురిపించటం మొదలుపెట్టింది. తరువాత గోల్డెన్ గేట్ బ్రిడ్జి దగ్గరికి వెళ్లాం. అది మాత్రం అమ్మమ్మకు భాగా నచ్చింది.

అంతకన్నా అమ్మమ్మకు బాగా నచ్చింది- భగభగమండుతున్న ఆమె గుండెమంటను తక్కువ ఆర్పిందీ ఆ మర్నాడు మేం వెళ్ళిన లివర్ మోర్ టెంపుల్.

కావాలనే అమ్మమ్మను అక్కడికి తీసికెళ్ళాను.

అమెరికాలో కూడా మన గుడులు, గోపురాలు, మన దేవుళ్ళు ఉన్నారా..ఎంత ఆశ్చర్యం..ఎంత ఆనందకరం..అంటూ భక్తి పారవశ్యంతో ఊగిపోయింది.

స్పష్టంగా, పెద్ద గొంతుతో మంత్రాలు చదువుతున్న పూజార్లు ఆమెకు ఎంతగానో నచ్చేసారు. అలా ఆ రోజు మా అమ్మమ్మను సంతృప్తిపరచగలిగాం. అయినా-

ఆ సాయంత్రం ఇంటికెళ్ళగానే మా అమ్మమ్మ నాకో క్లాసుపీకింది. ''నెలల నిండిన మనిషివి. నాకు ఊరు చూపించటం కోసమని నువ్వు ఇలా తిరిగితే..అధిక శ్రమ అవుతుంది. కాళ్ళు నొప్పులు పుడతాయి. బయట అవీ, ఇవీ తింటే అరగవు. పైత్యం చేస్తుంది, వేడి చేస్తుంది. ఇంక ఎక్కడికీ వెళ్ళొద్దు నీకు కాన్పు అయ్యేదాకా'' అని వార్నింగ్ ఇచ్చింది.

దాంతో ఇంట్లోనే రెస్ట తీసుకోవటం మొదలుపెట్టాను.

★ ★ ★

భోజనం చేసి అలా నడుం వాల్చగానే ఇలా కాస్త కునుకు పట్టింది. ఇంతలో బ్యాక్‌యార్డ్ నుంచి అమ్మమ్మ గొంతు వినిపించింది.

''అమ్మాయ్... ఓ తెల్లమ్మాయి..నిన్నే..ఓ అమెరికా అమ్మాయ్'' ఎవర్నో పిలుస్తోంది. బహుశ మా నైబర్‌ని అనుకుంటా అనే ఆలోచన రాగానే దిగ్గున లేచి భారంగానే అయినా కాస్తవేగంగా వెళ్ళాను.

అమ్మమ్మ పక్కింటికి..మాకు మధ్య ఉన్న ఫెన్సింగ్ దగ్గర నిల్చుని లాన్‌లో గడ్డి కట్ చేస్తున్న మా పక్కింటి అమెరికన్ లేడీని పిలుస్తోంది అమ్మమ్మ రెండు అరచేతుల్లో రెండు గిన్నెలున్నాయి.


''అమ్మమ్మా..ఏం చేస్తున్నావ్ అక్కడ?'' అన్నాను.

''నేను మనదేశం నుంచి తెచ్చిన ఆవకాయ కారం, అప్పడాలు, జంతికలు ఆ పక్కింటావిడకు కాస్త రుచి చూపిద్దామని పిలుస్తున్నాను. ఆంధ్ర ఆవకాయ ఎప్పుడయినా తిన్నదో లేదో పాపం..ఇరుగుపొరుగు అన్న తర్వాత ఆమాత్రం ఇచ్చిపుచ్చుకోవడాలు ఉండాలి కదా'' అంది.

''అమ్మమ్మా! ఇక్కడ అలాంటివి బాగుండవు. కొంపముంచి నువ్విచ్చిన ఆవకాయ

## మమతపై మోజు!

**చూస్తుంటే ఇదేదో కేరళ భామల సీజన్‌లా కనిపిస్తోంది. అశిన్, నయనతార, ప్రియమణి.. ఇలాంటి వారి లిస్టులోకి మమతా మోహన్ దాస్ కూడా చేరుతోంది. 'రాఖీ' సినిమాలో టైటిల్ సాంగ్ పాడిన మమతా మోహన్‌దాస్ నటి కూడా. మలయాళ సినిమాల్లో బిజీగా వున్న ఈ అందాల భామ టాలీవుడ్ ప్రవేశం 'ఆట' సినిమాతో జరగాల్సింది. కానీ ఏవో కారణాల అది కుదరలేదు. అయితే యమదొంగ, డాన్ సినిమాల్లో మమతా మోహన్ దాస్ ఎంపిక కావడం త్వరలోనే తెలుగులో ఆమె మరో క్రేజీ హీరోయిన్ అవుతుందా అనే ఆలోచనలకి దారి తీస్తోంది.**



కారం ఆమె తింటే తన నోరు మండించిన నేరానికి నీమీద కోర్టు కేసుపెడుతుంది'' అనగానే ''దీనికి..ఈమాత్రానికి కేసా?'' అని ఆశ్చర్యంతో బుగ్గలు నొక్కుకుంది అమ్మమ్మ.

''ఇక్కడ అంతే..అవును..ఒళ్లో ఆ పూలు ఏంటి? ఎక్కడ కోసావు..పక్కింటి వాళ్ళ చెట్టు నుంచా'' అని దాదాపు అరిచేసాను నేను.

''నాలుగు పూలు-సాయంత్రం దేవుడి పూజ కని''

''అమ్మమ్మా-ఇలా చేసావంటే..నువ్వు ఇక్కడి నుంచి వెళ్ళేలోగా ఏదో ఒక కోర్టు కేసులో ఇరుక్కుంటావు'' అంటూండగానే అకస్మాత్తుగా నాకు నొప్పులు ప్రారంభమయ్యాయి.

''అమ్మా'' అంటూ నేను నడుము పట్టుకోగానే..అమ్మమ్మ కంగారుపడిపోయి ''ఏంటే నొప్పలొస్తున్నాయా..పద పద లోపలికి'' అంటూ నాకు చెయ్యి ఆసరా ఇచ్చి నడిపించి నన్ను మంచం మీదకు చేర్చింది.

నన్ను ఫోన్ కలిపి ఇవ్వమని అడిగి మా వారితో మాట్లాడి 'త్వరగా ఇంటికి రమ్మని' తొందరపెట్టింది. అప్పటికప్పుడు వేడివేడి నీళ్ళు కాగపెట్టి నాకు స్నానం చేయించింది. ''ఎలా ఉందే..'' అంటూ ఆప్యాయంగా నా పక్కన కూర్చుని నా పొట్టనిమురుతూ తన కళ్ళల్లోని భయాన్ని, ఆందోళనను నాకు కనబడకుండా జాగ్రత్తపడింది.

''కాస్త ఓర్చుకో..మీ ఆయన రాగానే హాస్పటలకి వెళదాం. సాయంత్రానికల్లా నీకు పండంటి బిడ్డ పుడుతుంది'' అంటూ నన్ను మాటల్లో పెట్టి బాధను కాస్తంత మర్చిపోయేలా చేసింది. మావారు వచ్చి హడావుడిగా కారులో నన్ను, అమ్మమ్మను తీసుకెళ్ళారు. ఈలోగా అమ్మమ్మ మరచెంబులో మంచినీళ్ళు, ఫ్లాస్కులో కాఫీ...పాత చీరలు సర్దబోతుంటే అవేవీ వద్దని...అంతా వాళ్ళే చూసుకుంటారని చెప్పాను.

వెళ్ళగానే అడ్మిట్ చేసుకుని..కాన్పుకు లోపలికి తీసుకెళుతుంటే అమ్మమ్మ 'నేనూ వస్తానని దగ్గరుంటా'నని పదే పదే అంది. మావారు లోపల నా దగ్గర ఉండటం, తను బైట నిల్చోవలసి రావటం ఆమెకు విచిత్రంగా, నమ్మలేని విషయంలా అనిపించింది.

'ఇదేం దేశం..ఇవేం పద్ధతులు..పురిటి గదిలోకి మగవాడు రావటం ఏంటి?' అని విసుక్కోవటం మొదలుపెట్టిందట. ఆడపిల్ల పుట్టింది..'పేరేం పెట్టా'లన్న ఆలోచన వచ్చి అమ్మమ్మనడిగితే- ''అప్పుడే ఏం పేరు బారసాలలో పెట్టాలి గానీ'' అని దీర్ఘం తీసి ఇక్కడ ఇదే పద్ధతేమో బాలాత్రిపురసుందరి అని పెట్టండి అంది తన పేరు, అమ్మ వారి పేరూ కలిసి వచ్చేలా. అంత పొడుగు పేరు కాకుండా త్రిపుర అని పెట్టాం. అదీ అమెరికా డాక్టర్లకు, నర్సమ్మలకు నోరు తిరగలేదు. హాస్పటల్లో కారం పొడేసి అన్నం పెట్టడం, ఆముదం పట్టించడం కుదరకపోవటంతో చిన్నబోయిన అమ్మమ్మ ఇంటికి రాగానే విజృంభించిపోయింది.

లాలిపాటలు, జోలపాటలు, ఉగ్గుపెట్టడాలు, ఉయ్యాల ఊపడం, సాంబ్రాణి పొగ, వెల్లుల్లి వాసనలతో నా పురుడు నాకు అమెరికాలో జరుగుతున్నట్లుగా కాక..నా పుట్టింట్లో అమలాపురంలో జరుగుతున్నట్టే అనిపించింది అచ్చం.

అయినవాళ్ళ దగ్గర..అతి గారాబంగా జరిగిన నా తొలిప్రసవం నాకో మధురానుభూతిని కలిగించింది. అందుకు కారణం మా అమ్మమ్మ అమెరికా ప్రయాణమే.

★ ★ ★

పాపకు మూడు నెలలు వచ్చాయి.

అమ్మమ్మ ఇంట్లోనే చలిమిడి చేసి పాపకు ముద్దలు ఇప్పించింది. పేరంటాలు ఎవరూ లేరని గునుస్తుంటే నేనే ఇండియా నుంచి వచ్చిన తెలిసిన రెండు కుటుంబాల ఆడవాళ్ళకి ఫోన్ చేసి పిలిచాను. అమ్మమ్మను ఎక్కడికీ తీసికెళ్ళటం కుదరక పోవటంతో ఇకనుంచీ కాస్త అటూ ఇటూ తీసుకెళ్ళి చూపించాలని అనుకున్నాం. ఈమధ్య అమ్మమ్మకూ కాస్త అమెరికా పట్ల అవగాహన వచ్చింది.

అమ్మమ్మ తిరుగు ప్రయాణం ఇంక పదిహేను రోజులలో పడింది.

అమ్మమ్మ చదువుకోకపోయినా అమోఘమైన తెలివితేటలు ఆమె స్వంతం. అందుకే అమెరికా సంస్కృతిని అతి త్వరలోనే అర్థం చేసుకుంది.

ఇప్పుడు. ఇదివరకులా విమర్శించకుండా ఛా! ఛా, హవ్వ అని ఛీత్కారాలు, ఆశ్చర్యార్థకాలు వ్యక్తం చేయకుండా, 'ఎవరి పద్ధతులు వారివి- ఏ దేశ సంస్కృతి ఆ దేశానిది' అంటూ సమన్వయ ధోరణిలో మాట్లాడటం మొదలుపెట్టింది. అంతేకాదు అడపాదడపా అమెరికాను మెచ్చుకోవటం కూడా మొదలుపెట్టింది.

ఒకరోజు బార్ట్ స్టేషన్లో నించున్నాం.

కొంచెం సేపట్లో లోకల్ ట్రయిన్ రాబోతోంది.

ఇంతలో ఎక్కడి నుంచో కిచకిచమని పక్షుల అరుపులు వినిపించాయి. ''ఎక్కడో పక్షులు అరుస్తున్నాయి. ఇక్కడెక్కడా చెట్లు కూడా లేవు మరి!'' అని అమ్మమ్మ అటూ ఇటూ చూస్తుంటే మావారు అన్నారు. ''అది గుడ్డివాళ్ళకోసం వాళ్ళకు అర్థమయ్యే భాషలో 'ట్రయిన్ వస్తోందని' ఎనౌన్స్ చేస్తున్నారు మామ్మగారూ!'' అని చెబితే ''ఆహా! ఎంత మంచి ఏర్పాటు! ఈ తెల్లవాడిదెంతయినా జాలిగుండె'' అని తెగ మెచ్చేసుకుంది.

వీల్ చెయిర్తో సహా వికలాంగులు వాళ్ళంతట వాళ్ళే బస్సులెక్కడం, షాపింగ్లు చేయడం చూసి ఎంత ఆత్మవిశ్వాసం వీళ్ళకు..ఇదే మనదేశంలో అయితే 'నేను చేతగానివాడిని, ఇదంతా నా ఖర్మ' అంటూ చేతులు ముడుచుకుని కూర్చుంటారు. 'విధి'ని జయించటం అంటే ఇదే' అని - ఎంతయినా అమెరికా వాడు తెలివైన వాడు అని సర్టిఫికెట్ ఇచ్చేసింది అమ్మమ్మ. పాత, కొత్తల మేలుకలయిక అయినట్లు అమ్మమ్మ నా కళ్ళకు ఆరోజు కొత్తగా కన్పించింది.

ఆ రోజే అమ్మమ్మ తిరుగుప్రయాణం.

నాకే కాదు, మావారికీ ఆరోజు చాలా బాధగా అనిపించింది.

''ఎవరి పద్ధతులు వాళ్ళవని..కొంచెం సరిపెట్టుకోగలిగితే అమెరికా మొత్తానికి చాలా బాగుందే అలివేలు మంగతాయారూ..కన్నతల్లి లాంటి నా దేశానికి నేను వెళుతున్నానన్న ఆనందం ఒక పక్కన ఉన్నా..మరో పక్కన..మనసులో ఏదో మూల అమెరికాను వదిలి వెళుతున్నాను అనే ఆలోచన బాధ పెడుతోందే'' అంది అమ్మమ్మ.

ఆరునెలల అమెరికా నివాసం అమ్మమ్మను అంతగా కట్టిపడేసింది మరి. అనుబంధాన్ని, ఆత్మీయతను కలిగించింది.

అందుకే అన్నాను. ''మళ్ళీ అమెరికా రావాలి అమ్మమ్మా నువ్వు'' అని.

''ఎందుకు రాను. నీకు మళ్ళీ మలిచూలు కాన్పు ఉందిగా..మరో రెండేళ్ళకు మళ్ళీ వస్తాను'' అంది అమ్మమ్మ.

నేనూ, మా వారూ ఆ మాటలకు తెగ నవ్వేసుకున్నాం.

అమ్మమ్మ ఆశాజీవి. మనవరాళ్ళ, మునిమనవరాళ్ళ కాన్పులు కూడా కలుపుకుని 'పురుళ్ళుపోసే కార్యక్రమంలో సెంచరీ' కొట్టాలని చూస్తోంది. ఆమె నిండు నూరేళ్ళు జీవించాలనీ, ఆమె తలపెట్టిన కార్యక్రమం నిర్విఘ్నంగా కొనసాగాలనీ చిన్నదాన్నయినా నేనూ పెద్దమనసుతో కోరుకున్నాను.

